
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 89 | గురువారం 2 జూలై 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# యూట్యూబ్ ప్రశ్న రావణ్, ప్రముఖ జర్నలిస్టు కెవి రెడ్డిలపై అక్రమ కేసులు దుర్మార్గమైన చర్య

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**అంకుశం న్యూస్ విజయవాడ జూలై 2**



రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజాస్వామ్యం కూని అవుతున్నదని మాట్లాడే స్వేచ్ఛని సైతం హరిస్తున్నారనియూట్యూబర్లు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్, ప్రముఖ జర్నలిస్టు కె.వి.ఆర్ లపై అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయటాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఖండించారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసఫ్ అలియాస్ రావణ్ ను కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు ఒక కేసులో అరెస్టు చేయగా బుధవారం బెయిల్ పై విడుదలయ్యాడు. వెంటనే మరో కేసు పేరుతో పోలీసులు రావణ్ ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువచ్చిన రావణ్ పై జనసేన కార్యకర్తలు దాడికి దిగటం దుర్మార్గం.

అలాగే ప్రముఖ జర్నలిస్టు, డిజిటల్ మీడియా ఛానల్ నిర్వాహకులు కేవీ రెడ్డి తన చానల్లో ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురించి రాజకీయ విశ్లేషణ చేయటం జరిగింది. ఆ విశ్లేషణపై ఏపీ పోలీసులు కేవీ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నాం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛపై దాడికి పాల్పడుతున్నది. ప్రశ్నలను లేవనెత్తిన, రాజకీయ విశ్లేషణ చేసిన వారిపై అక్రమంగా కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయటం వంటి వేధింపులకు గురి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ, పోలీసు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు నమోదు చేయటాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజాతంత్ర వాదులంతా కూటమి ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండించాలని కోరుతున్నాం.

## విద్యార్థులతో పాటు టీచర్లకూ

# బ్రేక్‌ఫాస్ట్, లంచ్



- ఇక సర్కార్ బడి టీచర్లకు డబుల్ బెనిఫిట్స్
- రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో మరో వినూత్న నిర్ణయం తీసుకుంది.
- ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మాత్రమే అందుతున్న ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికీ విస్తరించనుంది

**హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంలో మరో వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అందుతున్న ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఇకపై ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికీ విస్తరించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన తొలి ఈ-కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు - మిగతా3లో

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై

# సిపిఐ దేశవ్యాప్త సమరభేరి

## సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**అంకుశం న్యూస్ విజయవాడ జూలై 2**

కేంద్రంలో గత 12 ఏళ్లుగా అధికారం చెలాయిస్తున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ కనుసన్నల్లో పని చేస్తూ వారి ఎజెండాను అమలు చేయడం తప్ప ప్రజలకు సంబంధించి ఏ ఒక్క వర్గానికి కూడ న్యాయం చేయకపోగా, ఏ రాముడి పేరుని వాడుకుని అధికారంలోకి వచ్చారో అదే దేవుడిని కూడ మోసం చేశారని రామకృష్ణ ఆగ్రహాంవ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంఅవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ - మిగతా2లో





## బెంగళూరు ఇస్రో కేంద్రానికి

# బాంబు బెదిరింపు కలకలం

- బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయానికి బాంబు బెదిరింపు
- చైర్మన్ కార్యాలయానికి ఈమెయిల్ ద్వారా అందిన సందేశం
- రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, ప్రాంగణంలో క్షుణ్ణ తనిఖీలు
- తనిఖీల్లో ఏమీ లభ్యం కాలేదని, ఉత్తుత్తిదేనని ప్రకటన

2

इसरो isro





## గోవింద నామస్మరణతో

# వైభవంగా రథోత్సవం

### భక్తి పారవశ్యంలో అప్పలాయగుంట మాడవీధులు

### భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగి స్వామివారి కృపకు పాత్రులైన భక్తులు

### సాయంత్రం అశ్వవాహన సేవ -జూలై 3న చక్రస్నానం



**అంకుశం న్యూస్ తిరుపతి జూలై 2**

అప్పలాయగుంటలో జరుగుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం జరిగిన రథోత్సవం భక్తి పారవశ్యంతో, వేదఘోషలు, మంగళవాయిద్యాలు, గోవింద నామసంకీర్తనల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు స్వామివారు రథారోహణం చేయగా, ఉదయం 8.45 గంటల నుండి 10.15 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో దివ్య విహారం చేస్తూ వేలాది మంది భక్తులకు అభయప్రద దర్శనం ఇచ్చారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగి స్వామివారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి.

**రథోత్సవ తాత్పర్యం:** రథోత్సవం ఆత్మతత్త్వాన్ని బోధించే మహోన్నత ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. ఆత్మ రథికుడు, శరీరం రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, - మిగతా2లో

## గోవింద నామస్మరణతో వైభవంగా రథోత్సవం

-మొదటిపేజీ తరువాయి

ఇంద్రియాలు గుర్రాలు, విషయాలు వీధులుగా భావించే ఈ ఉపమానం ద్వారా ఆత్మ--అనాత్మ వివేకాన్ని గ్రహించే అవకాశం కలుగుతుందని ఆగమ శాస్త్రాలు వివరిస్తాయి.

**వేడుకగా స్నపన తిరుమంజనం**

రథోత్సవం అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.15 గంటల వరకు శ్రీ స్వామి, అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీటితో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

**సాయంత్రం అశ్వవాహన సేవ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు.

**జూలై 3న చక్రస్నానం**

బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ఉదయం చక్రస్నానం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుండి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి, చక్రత్తాళ్వార్‌వారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10.30 నుండి 10.45 గంటల వరకు ఆలయం ఎదురుగా ఉన్న పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం జరుగుతుంది. రాత్రి 7 గంటల నుండి 7.30 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఎస్ఈ శ్రీ నరసింహమూర్తి, ఏఈవో దేవరాజులు, డిప్యూటీ ఈఈ రామ్మూర్తి, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఏఈ సురేష్‌రెడ్డి తదితర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ దేశవ్యాప్త సమరభేరి

-మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ఆగ దేశవ్యాప్త పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నటు ?ల ఆయన ప్రకటించారు. ఇందులోభాగంగా ఆగస్టు 6 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రతి గల్లీ, పట్టణం, నగరాల్లో పెద్ద ఎత్తున పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కోట్లాది మంది ప్రజలను కలిసి ప్రభుత్వ విధానాలను ఎండగడుతామని తెలిపారు. ఆ తర్వాత సెప్టెంబర్ 1న దేశ రాజధాని'చలో ఢిల్లీ' కార్యక్రమం ద్వారా మహా ర్యాలీని నిర్వహించనున్నమన్నారు. దేశంలో మార్పు కోసం, ప్రజా రక్షణ కోసం చేపట్టే ఈ 'చలో ఢిల్లీ' ర్యాలీని పాదయాత్రలను జయప్రదం చేయాలని ప్రజలకు, కార్మిక వర్గాలకు విజ్ఞప్తి రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ముడి చమురు ధరలు పెరిగాయని దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్,ను ధరలను విపరీతంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్ అదే ముడి చమురు ధరలు 40 శాతం తగ్గగా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ లీటర్ డీజిల్ కేవలం 3 రూపాయలు తగ్గించి ప్రజలను ముష్టి వేసినట్లు అవహేళన చేస్తోందని విమర్శించారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పదే పదే భారాలు మోపిన కేంద్రం, ఇప్పుడు ధరలు తగ్గినప్పుడు ఆ మేరకు ఇక్కడ ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. ప్రతిఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బిజెపి ప్రభుత్వం అవి ఇవ్వకపోగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' స్థానంలో వివి రామ్ జీ విధానాన్ని తీసుకువచ్చి, గ్రామీణ ప్రజలు, వ్యవసాయ కార్మికుల నోట్లో మట్టి కొట్టారనిఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాముడి పేరు చెప్పి అధికారం పొంది, విరాళాల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేసి, చివరికి ఆ రాముడికే టోపీ పెట్టారని విమర్శించారు. ఈఘటనపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## తుది దశకు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం చర్చలు

భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇండో-జపాన్ స్ట్రాటజిక్ డైలాగ్' కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## బెంగళూరు ఇస్రో కేంద్రానికి బాంబు బెదిరింపు కలకలం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రధాన కార్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపు నకిలీదని పోలీసులు నిర్ధారించారు. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇస్రో కేంద్రంలోని చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రాంగణాన్ని ఖాళీ చేయించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. బాంబు బెదిరింపుపై పోలీసులు కేసు నమోదు చేసి, ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఇస్రో కార్యాలయంలో కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దేశంలోని పలు కీలక సంస్థలకు ఇలాంటి నకిలీ బెదిరింపులు వస్తున్న నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. జూన్ 29న ఎన్ఐఏ, డీఆర్‌డీఓ వంటి సంస్థలకు బెదిరింపు ఈ-మెయిళ్లు పంపిన కేసులో ఢిల్లీ పోలీసులు ఘజియాబాద్‌కు చెందిన 36 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన గురువారం వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు.

# పరస్పర విశ్వాసమే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి

'పరస్పర విశ్వాసమే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, జపాన్ దేశాలు రక్షణ రంగంలో మొట్టమొదటి సారిగా ఒక ఉమ్మడి ప్రాజెక్టుపై చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆయన తెలిపారు. దీనితో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతికతలో సరికొత్త భాగస్వామ్యం కోసం ఇరు దేశాల ఒక ఉమ్మడి విజన్‌ను ఆవిష్కరించాయని చెప్పారు. దిల్లీలో జరిగిన భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సులో జపాన్ ప్రధాని సనాయె తకాయిచితో కలిసి ప్రధాని మోదీ ఈ కీలక ప్రకటనలు చేశారు. జపాన్? నాయకురాలు తన 'చెల్లెలు' అని మోదీ సంబోధించారు. "భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం భారత్‌కు విచ్చేసిన నా చెల్లెలు, జపాన్? ప్రధాని సనాయె తకాయిచికి స్వాగతం పలుకుతున్నా. ఆమె జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధాని, అలాగే దూరదృష్టి కలిగిన, ప్రజాదరణ పొందిన నాయకురాలు. ఆమె జపాన్‌లోని నారా ప్రిఫెక్చర్‌కు చెందినవారు. ఆ ప్రాంతం భారత్?, జపాన్ మధ్య ఉన్న ఉమ్మడి బౌద్ధ వారసత్వానికి ఒక కీలక కేంద్రంగా ఉంది. కొద్ది రోజుల క్రితం జరిగిన +7 శిఖరాగ్ర సమావేశంలో, ప్రపంచ సంక్షోభ సమయంలో పరస్పర విశ్వాసమే మన అత్యంత విలువైన వ్యూహాత్మక ఆస్తి అని నేను చెప్పాను. గత కొన్ని దశాబ్దాలుగా, ఆటోమొబైల్ నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు వివిధ రంగాల్లో భారత్?కు సహకారం అందించడంలో జపాన్ కీలక పాత్ర పోషిస్తోంది.



నేడు, ప్రధాని పర్యటనతో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంలో మేం ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం."

**ఇరుదేశాల భాగస్వామ్యం మరింత బలోపేతం**

భారత్- జపాన్ దేశాల మధ్య పెట్టుబడి భాగస్వామ్యం క్రమంగా బలపడుతోందని మోదీ పేర్కొన్నారు. గడిచిన ఏడాది కాలంలో సుమారు 120 కొత్త వ్యాపార ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 10 బిలియన్ డాలర్లకు పైగా జపాన్ పెట్టుబడులు భారతదేశానికి రానున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏజెన్సీల మధ్య కుదిరిన ఒప్పందం, మూలధనం, పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత సులభతరం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, బయోటెక్నాలజీ రంగాల్లో కుదిరిన ఒప్పందాల ద్వారా, ప్రపంచ ఆరోగ్య భద్రతకు కూడా దోహదం చేస్తాయని తెలిపారు. తమ టార్గెట్,? జపాన్ నుంచి భారత్?కు 10 ట్రిలియన్?ల పెట్టుబడులను ఆకర్షించడం, రానున్న దశాబ్ద కాలంలో దేశంలో పనిచేస్తున్న జపాన్ కంపెనీల సంఖ్యను రెట్టింపు చేయడమేనని స్పష్టం చేశారు. ఇక, దేశంలో నిరంతరంగా జరుగుతున్న సంస్కరణలు వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపరిచాయని, ఈ అవకాశాన్ని జపాన్ కంపెనీలు కూడా సద్వినియోగం చేసుకోవచ్చునని మోదీ అభిప్రాయపడ్డారు.

**'ఇంధన భద్రతపై కీలక నిర్ణయాలు తీసుకున్నాం'**

మరోవైపు, ఆర్థిక భద్రత కోసం ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు మోదీ పేర్కొన్నారు. "ఆర్థిక భద్రత కోసం మేమిప్పుడు ఒక ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశాం. దీని ద్వారా, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, అధునాతన మెటీరియల్స్ వంటి వ్యూహాత్మక రంగాల్లో సరఫరా గొలుసు స్థితిస్థాపకతను బలోపేతం చేస్తాం. అలాగే, నేటి అనిశ్చిత యుగంలో, ఆర్థిక, ఇంధన భద్రత ప్రాముఖ్యతను భారత్, జపాన్ దేశాలు పూర్తిగా అర్థం చేసుకున్నాయి. దీనిపై కూడా మేం కీలక నిర్ణయాలు తీసుకున్నాం. దేశం అంతటా 1000 బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల ప్లాంట్లను స్థాపించడంలో భారత్- జపాన్ బయోగ్యాస్ చొరవ మాకు సహాయపడుతుంది. ఇది మా 'గోబర్ధన్' చొరవను మరింత బలోపేతం చేస్తుంది. గ్రామాల్లో సుస్థిరత, శ్రేయస్సు, గ్రామీణ జీవనోపాధికి కొత్త ఊపునిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.

# భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం

భారత్, జపాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడ్డాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు మూడు రోజుల అధికారిక పర్యటన కోసం భారత్‌కు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి గురువారం దిల్లీలో ప్రధాని మోదీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా మాట్లాడిన జపాన్ ప్రధాని, స్వేచ్ఛాయుత, సుసంపన్నమైన, నిబంధనల ఆధారిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణం భారత్, జపాన్ ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు. ఈరోజు ప్రారంభించిన కార్యక్రమాలు ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్, జపాన్ కూడా ఉన్నాయని సనాయే తకాయిచి అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలను విశ్వసించే దేశాలుగా రెండు దేశాలు కలిసి అనేక కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక పురోగతి మరింత బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ తనను "అందమైన చెల్లెలు"గా సంబోధించడం సంతోషంగా అనిపించిందని తకాయిచి వ్యాఖ్యానించారు. భారత్‌తో జపాన్‌కు ఉన్న ప్రత్యేక సంబంధాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని చెప్పారు. ఇటీవల తాము ప్రకటించిన నవీకరించిన "ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో-పసిఫిక్" విధానానికి అనుగుణంగా భారత్‌తో వ్యూహాత్మక సహకారాన్ని మరింత విస్తరించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు.

**కీలక రంగాల్లో అవగాహన ఒప్పందాలు**



రక్షణ రంగంలోనూ ఇరు దేశాల మధ్య సహకారం మరింత పెరగనుందని జపాన్ ప్రధాని తెలిపారు. జపాన్ రక్షణ దళాలు, భారత నౌకాదళం కలిసి సంయుక్త విన్యాసాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఈ ఏడాది ముగిసేలోపు భారత్- జపాన్ విదేశాంగ, రక్షణ మంత్రుల 2o2 సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ (×జూా)లో భారత్ సభ్యత్వానికి జపాన్ మద్దతు కొనసాగుతుందని కూడా ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా పలు కీలక రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. భారత భూగర్భ సర్వే సంస్థ, జపాన్ ఆర్గనైజేషన్ ఫర్ మెటల్స్ అండ్ ఎనర్జీ సెక్యూరిటీ మధ్య భూగర్భ శాస్త్రం, కీలక ఖనిజాల అన్వేషణలో సహకారానికి సంబంధించి ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భవిష్యత్ అవసరాలకు కీలకమైన ఖనిజ వనరుల గుర్తింపు, అన్వేషణలో ఈ ఒప్పందం ఉపయోగపడనుంది.

ఔషధాలు, వైద్య పరికరాల రంగంలో సహకారం పెంపునకు మరో అవగాహన ఒప్పందం కుదిరింది. అలాగే భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖల మధ్య బ్యాటరీల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి సంబంధించి మరో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ, స్వచ్ఛ ఇంధన రంగానికి ఇవి దోహదపడనున్నాయి. ఇక సహకార మంత్రిత్వ శాఖ, పశుసంవర్ధక శాఖలతో కలిసి బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల ఉత్పత్తి, వినియోగాన్ని విస్తరించేందుకు కూడా మరో అవగాహన ఒప్పందం కుదిరింది. ఇంధన భద్రత, గ్రామీణాభివృద్ధి, సుస్థిర రవాణా వ్యవస్థ అభివృద్ధికి ఈ సహకారం ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ద్వైపాక్షిక సమావేశానికి ముందు జపాన్ ప్రధానికి రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం లభించింది. అధికారిక స్వాగత కార్యక్రమంలో ప్రధాని మోదీ తన మంత్రివర్గ సహచరులు, ఇతర ఉన్నతాధికారులను జపాన్ ప్రధానికి పరిచయం చేశారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. పరస్పర విశ్వాసం ఆధారంగా ఏర్పడిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు అధికారులు తెలిపారు. జూలై 1 నుంచి 3 వరకు సనాయే తకాయిచి భారత్‌లో అధికారిక పర్యటన కొనసాగనుంది. ఈ సందర్భంగా జరిగిన 16వ భారత్--జపాన్ వార్షిక సదస్సులో ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, కీలక సాంకేతిక రంగాలు, శక్తి భద్రతతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరు దేశాల నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్, జపాన్ మధ్య సంబంధాలు శతాబ్దాల నాటి సాంస్కృతిక, నాగరికత సంబంధాలపై ఆధారపడి ఉన్నాయి.

# అయోధ్య రామయ్య విరాళాల చోరీ కేసు

రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ విరాళాల చోరీని ఆయన 'చందా చోరీ మెగా స్కాండల్'గా అభివర్ణించారు. ఈ ఘటనపై తక్షణమే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భక్తులు అయోధ్య రామయ్యకు సమర్పించిన వందలాది కోట్ల రూపాయల విరాళాలు చోరీ కావడాన్ని భారీ మోసంగా పేర్కొన్నారు. ఇది హిందూ విశ్వాసానికి, మతానికి, జీవన విధానానికి చేసిన ఘోరమైన ద్రోహంగా అభివర్ణించారు. "శ్రీరాముడుని న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపంగా హిందువులు పూజిస్తారు. అయోధ్య రామమందిర విరాళాల చోరీపై వచ్చిన ఆరోపణపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి. అలాంటి చోరీ ఆరోపణలను మరుగున పడేయడానికి అనుమతించడం రామయ్య భక్తులకు తీవ్రమైన అన్యాయం చేయడమే అవుతుంది. అయోధ్యలోని రామ మందిరంలో జరిగిన భారీ ఆర్థిక మోసం, దొంగతనం, విరాళాల దుర్వినియోగం వంటి దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి రావడం పట్ల లక్షలాది మంది భారతీయులు వ్యక్తం చేస్తున్న తీవ్ర ఆవేదన, ఆగ్రహాన్ని తెలియజేయడానికే నేను మీకు (మోదీనుద్దేశించి) ఈ లేఖ రాస్తున్నాను. శ్రీరాముడిపై ఉన్న ప్రగాఢ విశ్వాసం, భక్తితో తమ కష్టార్జితాన్ని, జీవిత పొదుపును వెచ్చించి సమర్పించిన సామాన్య పౌరుల కానుకలను సిగ్గులేకుండా కొందరు దోచుకున్నారు. లక్షలాది మంది పవిత్రంగా భావించే రామ మందిరం పవిత్రతనే దెబ్బతీశారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కళ్ల ముందే అత్యంత వ్యవస్థీకృతమైన ఒక ముఠా పనిచేస్తోందని కొనసాగుతున్న ప్రాథమిక విచారణలో వెల్లడైంది. " అని ప్రధాని మోదీకి రాసిన లేఖలో కేసీ వేణుగోపాల్ తెలిపారు.

**'సీసీటీవీ ఫుటేజీని చెరిపేశారు'**

కానుకల లెక్కింపు సిబ్బంది సాధారణ నిఘాను తప్పించుకుని ప్రతిరోజూ పెద్ద మొత్తంలో నగదు, విలువైన ఆభరణాలను దోచుకున్నారని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. మరోవైపు ఈ నేరపూరిత కార్యకలాపాల ఆనవాళ్లను చెరిపివేయడానికి 7 నుంచి 8 నెలల కీలకమైన సీసీటీవీ ఫుటేజీని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని మండిపడ్డారు. ఈ దోపిడీ కేవలం కొందరు అవినీతి ఉద్యోగుల పని కాదని, పైఅధికారుల



కుమ్మక్కుతో నడిపిన కుట్రని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. అదే సమయంలో విరాళాల దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులను విస్మరించడం, ఉద్దేశపూర్వకంగా అణచివేయడం జరిగిందని మండిపడ్డారు. 2020-21లోనే లెక్కల్లో చూపని బంగారు, వెండి ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నారని హెచ్చరించిన ట్రస్ట్ మాజీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ మాటలను లెక్కజేయకుండా ఆయన్ను విధుల నుంచి తొలగించారని అన్నారు. అయోధ్య రామమందిర విరాళాల చోరీపై జూన్ 13న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్, ఆ తర్వాత జూన్ 25న నమోదైన ఎఫ్ఐఆర్ కేవలం కంటితుడుపు చర్యగానే కనిపిస్తున్నాయని ఆరోపించారు.

**చిన్న చేపలనే అరెస్ట్ చేశారు : కేసీ వేణుగోపాల్**

"అయోధ్య రామయ్య విరాళాల చోరీ కేసులో ఇప్పటివరకు కేవలం డ్రైవర్లు, క్లర్కులు, అవుట్ సోర్సింగ్ క్యాషియర్ల వంటి చిన్న చేపలను మాత్రమే పట్టుకున్నారు. కానీ ఈ బహిరంగ దోపిడీకి సహకరించిన వ్యవస్థాగత మద్దతు, బాధ్యులైన ఉన్నతాధికారుల వ్యవస్థ మాత్రం అలాగే ఉండిపోయింది. అపారమైన రాజకీయ, వ్యవస్థాగత ప్రభావం కలిగిన వ్యక్తులపై దర్యాప్తు చేయడానికి యూపీ ప్రభుత్వం నియమించిన సిట్‌కి తగిన సామర్థ్యం గానీ, వ్యవస్థాగత స్వతంత్రత గానీ లేవు. కోట్లాది రూపాయల ఈ నిధుల దుర్వినియోగానికి సూత్రధారులుగా ఉన్న పెద్ద చేపలను కాపాడుతూనే, మిగిలిన ఆధారాలను కూడా తుడిచిపెట్టేం దుకు సిట్ దర్యాప్తును వాడుకుంటున్నారనే ఆందోళన పెరుగుతోంది. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అనేది 2020లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక ప్రజా ట్రస్ట్. కాబట్టి విరాళాల కుంభకోణంలో అత్యున్నత స్థాయి జవాబుదారీతనం అవసరం. అయోధ్య విరాళాలను భద్రంగా ఉంచడం, శ్రీరాముని పేరిట స్థాపించిన సంస్థ పవిత్రతను కాపాడటంలో ప్రభుత్వ చిత్తశుద్ధి, సామర్థ్యంపై 140 కోట్ల మంది భారతీయులకు ఉన్న నమ్మకాన్ని పునరుద్ధరించడం ప్రభుత్వం, ప్రభుత్వాధినేతగా మీ (మోదీనుద్దేశించి) నైతిక బాధ్యత. అందువల్ల సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విరాళాల చోరీ కేసుపై ఒక ఉన్నత స్థాయి స్వతంత్ర సంస్థ ద్వారా నిష్పక్షపాతమైన దర్యాప్తు జరగాలి" అని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ ను వేగవంతం చేయాలి

- ఈనెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ కార్యక్రమంను తప్పకుండా పూర్తి చేయాలి..లి
- : రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏలు సహకారం అందించాలి..
- : ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..
- : కంట్రోల్ రూమ్ పెట్టి పర్యవేక్షణ..
- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..
- : అనంతపురంలోని నారాయణపురం పంచాయతీ పరిధిలో మరియు రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి గ్రామ సచివాలయంలో ఎస్ఐఆర్ ను ర్యాండమ్ గా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..





**అంకుశం న్యూస్ అనంతపురం, జులై 02 :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సమయం తక్కువగా ఉంది.. ఈనెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ కార్యక్రమంను తప్పకుండా పూర్తి చేయాలన్నారు.

- అనంతపురం అర్బన్ పరిధిలోని నారాయణపురం పంచాయతీలో ఉన్న పోలింగ్ స్టేషన్ నెంబర్.10 (తపోవనం, శివాలయం వెనుక) పరిధిలో గురువారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి తీసుకోవడాన్ని యాదృచ్ఛికం (ర్యాండమ్)గా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఇందులో బిఎల్ఓ, బిఎల్ఏలు, ఓటర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఎలా చేస్తున్నారు, ఎలా పూర్తి చేస్తున్నారు, అందరికీ ఫారాలు అందాయా, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు ఎదురుగా కూర్చుని నింపాలన్నారు. డిఆర్డిఏ సిబ్బందితోపాటు వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారని, వారిని కూడా పిలిపించుకుని ఎస్ఐఆర్ చేపట్టాలన్నారు. బిఎల్ఓలతో పాటు ఇతర శాఖలకు చెందిన ఇద్దరు, ముగ్గురు సిబ్బందిని వినియోగించుకునేలా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. సచివాలయంలో బిఎల్ఓ విధులు అప్పగించిన వారిని మినహా ఇతర సిబ్బందిని బిఎల్ఓలకు అటాచ్ చేయాలని, నగరంలో మెప్మా, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని నియమించేలా ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ఫోన్ ద్వారా నగర పాలక సంస్థ కమిషనర్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్ పెట్టి బిఎల్ఓలతోపాటు ఇతర శాఖల సిబ్బంది సర్ కార్యక్రమంలో వెళుతున్నారా లేదా అనే దానిపై పర్యవేక్షణ చేస్తూ ప్రతిరోజూ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏలు సహకారం అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైతే ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదో వారికి ఫారాలను అందించేలా సంబంధిత బిఎల్ఓలతో పక్కనున్న బిఎల్ఓలను టైఅప్ చేయించాలన్నారు. సూపర్వైజర్ పరిధిలో 10 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వారి పరిధిలో అందరు బిఎల్ఓలు వచ్చారా అనేది చూసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ను వేగంగా చేపట్టాలన్నారు. పూరించిన ఈఎఫ్ ఫారాలను కలెక్షన్ మరియు ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇన్చార్జ్ తహసిల్దార్ డి.రాజ, సూపర్వైజర్ సాయికిరణ్, బిఎల్ఓ సాయిరాంరెడ్డి, టిడిపి బిఎల్ఏ అక్షిత, వైఎస్ఆర్సిపి బిఎల్ఏ వెంకటరామిరెడ్డి, ఆర్ఐ తేజ, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి గ్రామ సచివాలయంలో ఎస్ఐఆర్ ను ర్యాండమ్ గా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ :లిఅనంతరం రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి గ్రామ సచివాలయంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో పోలింగ్ స్టేషన్ నంబర్ 129, 134 పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఏ విధంగా చేస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని ఫారాలను పంపిణీ చేసి తిరిగి తీసుకున్నారు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఎస్ఐఆర్ లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చెన్నకేశవ, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికై కృషి చేయండి

- : అనంతపురం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎం.రాజశేఖర్లి





**అంకుశం న్యూస్ అనంతపురం, జులై 02 :** అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవా సదన్ నందు అనంతపురం అర్బన్, రూరల్ పరిధిలో గల పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు మరియు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, మరియు పోలీస్ వారితో గురువారం అనంతపురం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎం.రాజశేఖర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జులై 11వ తారీఖున జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నందు అనంతపురం అన్ని స్టేషన్ల పరిధిలోగల రాజీ పడదగ్గ కేసులను నిర్ధారించి వాటి వాటి పరిష్కారానికోసం శాయశక్తులా కృషి చేయాలన్నారు. మన అనంతపురం జిల్లాలో సంఖ్యాపరంగా ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేటట్టు కృషి చేయాలని హాజరైనటువంటి పోలీస్ అధికారులను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి గౌరవనీయులు జడ్జిగారు ఎం.రాజశేఖర్ కోరారు. ఈ సమావేశంలో అనంతపురం రూరల్ డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ వారి వారి పరిధిలో గల స్టేషన్లో అర్హత కలిగిన కేసులను గుర్తించాలని వారి అధికారులను కోరుతూ కావలసినటువంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో అనంతపురం వన్ టౌన్, టూ టౌన్, పోర్ట్ టౌన్, రూరల్ మరియు ట్రాఫిక్ బుక్కరాయసముద్రం ఇన్స్పెక్టర్లు మరియు రాప్తాడు ఇటుకలపల్లి ఆత్మకూర్, గార్లదిన్నె మరియు నార్పలకు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## వీబీ-జి రాంజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే,ఎంపీ



**అంకుశం న్యూస్, కదిరి ,జూలై :2:** సత్యసాయి జిల్లా, కదిరి నియోజకవర్గం, కొండమనాయుని పాల్యం గ్రామం నందు వికసిత్ భారత్ రోజ్గార్,అజీవికా మిషన్ గ్రామీణ పథకం (విబి-జి రామ్ జి) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి. కే. పార్థసారథి,కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్,బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, అధికారులు,గ్రామస్తులు, కూలీలు,కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విజయవాడ పార్లమెంట్ పరిధి లో రూ.32.40 లక్షల
# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎంపీ చిన్ని

- "61 కుటుంబాలకు ఆర్థిక ఊరట!"





**అంకుశం ప్రతినిధి విజయవాడ జులై 2:** ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా నిలవాలనే సంకల్పంతో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిజమైన ఆపద్బాంధవుడిగా మారిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న సాయం వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపుతోందన్నారు. గురువారం విజయవాడ పార్లమెంట్ పరిధిలోని విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలతో పాటు తిరువూరు నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.32,40,252 విలువ గల

61 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ చిన్ని పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తున్న ఎంపీ చిన్ని మరోసారి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ"అనారోగ్యం ఒక్క కుటుంబాన్నే కాదనీ,ఆ కుటుంబ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేస్తుందని అలాంటి క్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద భరోసాగా నిలుస్తోందన్నారు. డబ్బుల్లేవని ఎవరి వైద్య చికిత్స ఆగిపోకూడదన్నదే తమప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం వారి గడప వరకూ చేరేలా ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తాను" అని స్పష్టం చేశారు. మండలాల వారీగా పంపిణీ చేసిన చెక్కుల వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ మండలంలో 8 మందికి రూ.8,55,118, ఎ.కొండూరు మండలంలో 6 గురికి రూ.3,50,665, గంపలగూడెం మండలంలో 25 మందికి రూ.10,40,232, విస్సన్నపేట మండలంలో 11 మందికి రూ.3,55,619, తిరువూరు మండలంలో 12 మందికి రూ.7,17,618 విలువైన చెక్కులను అందజేశారు. మొత్తంగా 61 మంది లబ్ధిదారులకు రూ.32,40,252 ఆర్థిక సహాయాన్ని అందించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు భావోద్వేగానికి లోనయ్యారు. క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఈ సాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొంటూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల కష్టాన్ని తన బాధగా భావిస్తూ,ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో ఎంపీ కేశినేని చిన్ని నిరంతరం కృషి చేస్తుండటం విజయవాడ పార్లమెంట్ పరిధిలో ప్రజలకు మరింత భరోసాను కల్పిస్తోంది.

## కదిరి అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతాను ఎమ్మెల్యే కందికుంట



**అంకుశం న్యూస్,కదిరి, జూలై:2:** కదిరి శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం నందు జరిగిన సమావేశంలో తిరుమాడ విధుల్లో చేయవలసిన రోడ్డు విస్తరణ విషయం పై కదిరి పుర ప్రముఖులతో, తిరుమాడ విధుల్లో నివాసాలు ఉండే పెద్దలతో వారి అభిప్రాయాలను, సలహాలు, సూచనలు తీసుకొని,రోడ్డు విస్తరణ పనులు బలవంతంగా కాకుండా,వారి ఇష్ట ప్రకారం,మరొక్క సారి సమావేశం ఏర్పాటు చేసి ఎవరిని నొప్పించకుండా కదిరి అభివృద్ధి లో భాగస్వామ్యం అవుతామని అని తెలియజేసిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్,జాయింట్ కలెక్టర్ ఌ కదిరి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అభిషేక్ మౌర్య,మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి,ఆర్డీవో కళావతి,కమిషనర్ విజయ్ కుమార్,డీఎస్పీ శివనారాయణ స్వామి,సీనియర్ లాయర్ సుబ్బరాజు గుప్తా,కదిరి పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## 24 అడుగుల శ్రీ షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి రూ.1.30,116 విరాళం



**అంకుశం న్యూస్, అనంతపురం, జూమ్: 2:** బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువు కట్టపై ఏర్పాటు చేయనున్న 24 అడుగుల శ్రీ షిర్డీ సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కోసం సింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు తమ వంతు సహకారంగా రూ.1,30,116 విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతపురం నగరంలోని తమ నివాసంలో ఆలయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఆలయ గౌరవ అధ్యక్షుడు విజయనాథ్ లకు సింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామి రెడ్డి విరాళాన్ని అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి ఉదార సహకారం 24 అడుగుల శ్రీ షిర్డీ సాయిబాబా నూతన విగ్రహ నిర్మాణం, ప్రతిష్ఠాపన కార్యక్రమం, ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖలో జీవో ఎంఎస్ నెంబర్ 396 ను ఉపసంహరించుకోవాలి..



**అంకుశం న్యూస్ ధర్మవరశీ జులై 2:** రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేట్ భాగస్వామ్యం విషయమై విడుదలైన జీవో ఎంఎస్ నెంబర్ 396 ను ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖరులు అండ్ స్టాంప్ వెండర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జావిద్, ఉపాధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి మహేంద్ర, కోశాధికారి మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేటీకరణ విధివిధానాలను వ్యతిరేకిస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీసులను ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. దీనివల్ల దస్తావేజు లేఖరులు వారి సహాయకులు కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోవలసి వస్తుందని తెలిపారు. చట్టబద్ధతలేని ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వ నిర్ణయాన్ని తీసుకోవడం చాలా దారుణమని, ఇలాంటి మార్పుల వల్ల అవకతవకలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సుధాకర్, వెంకటేష్ ,ధను, లేఖరులు రామాంజనేయులు, బాలాజీ, వాజీ ,గోపి, కీర్తి, నాగార్జున, మల్లికార్జున, సదాశివ, కార్తీక్, బాబు, మణిదీప్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అరవకూరులో వికసిత్ భారత్ - జి రామ్ జి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్..

- : పార పట్టి ఉపాధి హామీ పనులు చేసి కూలీల్లో స్ఫూర్తి నింపిన మంత్రి పయ్యావుల కేశవ్..
- : ఉపాధి హామీ శ్రామికులతో ముచ్చటించిన మంత్రి..





**అంకుశం న్యూస్ ఉరవకొండ జులై 02 :** గ్రామీణ పేదల సాధికారత, సమగ్ర సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్, ఆజీవికా మిషన్ - గ్రామీణ్ (విబి జి రామ్ జి) పథకాన్ని గురువారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం.. కూడేరు మండలంలోని అరవకూరు గ్రామ పంచాయతీలోని పని ప్రదేశంలో జిల్లా స్థాయిలో రాష్ట్ర ఆర్థిక ,ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లాంఛనంగా ప్రారంభించారు. అరవకూరు గ్రామ పంచాయతీలోని చెరువు కట్ట వద్ద కాలువలో కూడికతీత పనులను మంత్రి ప్రారంభించగా, మంత్రి స్వయంగా గడ్డపార పట్టి వికసిత్ భారత్ - జి రామ్ జి కింద ఉపాధి హామీ పనులు చేసి ఉపాధి హామీ శ్రామికులలో స్ఫూర్తి నింపారు. అనంతరం ఉపాధి హామీ శ్రామికులతో ముచ్చటించారు. మీకు రోజు ఎంత వేతనం వస్తుంది, వారికి అందుతున్న వేతనాలు, పనిదినాలు, కూలీ చెల్లింపుల విధానం, తదితర అంశాలను మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'వికసిత్ భారత్ -- జి రామ్ జి' పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల శ్రామికులకు సంవత్సరానికి 125 రోజుల వరకు మెరుగైన వేతనంతో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, కూలి చెల్లింపులు సకాలంలో వారి ఖాతాల్లో జమయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ పథకం గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేయడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు.'వికసిత్ భారత్ -- జి రామ్ జి' పథకంను ఉపాధి హామీ శ్రామికులు ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డ్వామా పిడి సలీమ్ భాష,ఏపీడి చెన్నకేశవులు,ఎంపీడీవో కుల్లాయి స్వామి, నాయకులు,ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

# చంద్రన్న పాలనలో బీసీల విద్యకు అధిక ప్రాధాన్యం





- రూ.12 కోట్లతో పెనుకొండ ఐటీఐకి శాశ్వత భవనం
- హనుమప్ప పల్లిలో రూ.45 కోట్లతో ఎంజేపీ గురుకులానికి శాశ్వత భవనం
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తో కలిసి పనులు ప్రారంభించిన మంత్రి సవిత

**అంకుశం ప్రతినిధిపెనుకొండ/శ్రీసత్యసాయి :** వీబీ జీ రామ్ జీ పథకంతో గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రంలో బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందులో భాగంగా 10 నూతన ఎంజేపీలను ప్రారంభిస్తున్నామని, వాటిలో మూడిండిని ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొల్పుతున్నామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని రాంపురం పంచాయతీ హనుమప్ప పల్లిలో రూ.45 కోట్లతో ఎంజేపీ గురుకుల భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తో కలిసి మంత్రి సవిత గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, వీబీ జీ రామ్ జీ పథకంతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, కాలువల సహా పలు మౌలిక వసతుల కల్పనకు అవకాశం కలుగుతోందన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో మరింత అభివృద్ధి చేపట్టడానికి వీలు కలుగుతోందన్నారు. కూలీల వేతనం రోజుకు రూ.312 లు చెల్లించనున్నారన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం కింద చేపట్టే పనులను మరింత నాణ్యంగా చేపట్టేలా కూటమి నాయకులు, కార్యకర్తలు పర్యవేక్షించాలని సూచించారు. పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం వల్ల కూలీలకు మరింత ఉపాధి, ఆదాయం లభిస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**బీసీల విద్యకు అధిక ప్రాధాన్యం**

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపార

**10 ఎకరాల్లో రూ.45 కోట్లతో...**

తన తండ్రి స్వగ్రామమైన హనుమప్ప పల్లిలో ఏర్పాటు చేసిన ఎంజేపీ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం కల్పించడం ఆనందాన్నిస్తోందని మంత్రి సవిత తెలిపారు. పది ఎకరాల విస్తీర్ణంలో రూ.45 కోట్లతో ఎంజేపీ గురుకుల పాఠశాలకు శాశ్వత భవన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. పెనుకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు



రూ.12 కోట్లతో శాశ్వత భవనం నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఎంజేపీ గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, క్రీడల్లోనూ రాణించేలా స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ షూట్లు అందజేస్తున్నామన్నారు. హనుమప్ప పల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, హనుమప్ప పల్లి గ్రామస్తులు, ఎంజేపీ గురుకుల విద్యార్థులు పాల్గొన్నారు.

# కూలీల సంక్షేమమే లక్ష్యం: 'వీబీ-జీ రామ్ జీ'తో అదనపు పనిదినాలు, కూలీ పెంపు - ఎమ్మెల్యే పరిటాల సునీత







**రాప్తాడు, అంకుశం న్యూస్ జూలై 2ఛ:** "కూలీల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న 'వీబీ-జీ రామ్ జీ' పథకం వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుంది. గతంలో 100 రోజులు మాత్రమే ఉన్న పని దినాలను 125 రోజులకు పెంచడమే కాకుండా, రోజువారీ కూలీని రూ. 307 నుండి రూ. 312కు పెంచడం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం గొప్ప భరోసా కల్పిస్తోంది" అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలక మార్పులు చేస్తూ కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన 'వీబీ-జీ రామ్ జీ' పథకం నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల వాటాతో పనులు చేపట్టనున్నారు. తిరుపతి జిల్లా ముక్కావారిపల్లిలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాప్తాడు ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులు, కూటమి నాయకులు, కూలీలతో కలిసి ఎమ్మెల్యే సునీత ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం మహిళా కూలీలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంపై 30 శాతం అదనపు భారం పడినప్పటికీ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూలీల ప్రయోజనాలకే పెద్దపీట వేశారని కొనియాడారు. పథకం అమలులో ఎటువంటి రాజకీయాలకు తావులేదని, పనిచేసిన ప్రతి ఒక్కరికీ వేతనం పక్కాగా అందుతుందని స్పష్టం చేశారు. కూలీలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు పథక పర్యవేక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

?ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.విజయలక్ష్మి, ఏపీఓ సావిత్రి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శీనా, మార్కెట్ కమిటీ చైర్మన్ వేపకుంట సుధాకర్, సొసైటీ ఛైర్మన్ మరూరు గోపాల్, డిప్యూటీ ఎంపీడీఓలు అశోక్ బాబు, అచ్యుత్ బాబు, ఈసీ మురళీ, ఎంపీటీసీ జాఫర్, నాయకులు సాకే నారాయణస్వామి, గుజ్జల నారాయణస్వామి, బీరన్న, మాన్లుకోసే కేశవ, మోహన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ తలారి శివ, గంగలకుంట శివ తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టికృషి తోనే అంతర్జాతీయ గుర్తింపు

- అభినందన సభలో ఆవుల చంద్రశేఖర్ వెల్లడి

**అంకుశం ప్రతినిధి విజయవాడ, జులై 02 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టికృషి తోనే తనకు అంతర్జాతీయ అవార్డు దక్కిందని ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్ లో "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" వారి అంతర్జాతీయ అవార్డును ఇటీవల అందుకుని గురువారం తొలిసారిగా కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అనంతరం సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్తంగా సిఈఓ చంద్రశేఖర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన విజయం వెనక ఎందరో కృషి దాగి వుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ కు, వైద్య, ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ, ఆయుష్, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనాశాలలు, మార్కెటింగ్ సంస్థల సహకారం మరువలేనిదన్నారు. ప్రజారోగ్యం కోసం భారతీయ సనాతన వైద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి తన అవార్డు అంకితమన్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన 10వ సమ్మిట్ - అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్‌లోని ప్రతిష్టాత్మకమైన హౌస్ ఆఫ్ కామన్స్, ప్యాలెస్ ఆఫ్ వెస్ట్‌మిన్‌స్టర్‌లో ఘనంగా నిర్వహించిందన్నారు. ఈ విశిష్టమైన వేడుక, యూకే (యునైటెడ్ కింగ్‌డమ్), యూఎస్ఏ (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా), రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, ఇండియా, నేపాల్, కజకిస్తాన్, కెనడా, మెక్సికో, పోర్చుగల్, స్పెయిన్, స్విట్జర్లాండ్, బెల్జియం, జర్మనీ, ఈజిప్ట్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, పోలాండ్, జపాన్, ఆస్ట్రేలియా, మారిషస్ దేశాల నుండి వచ్చిన అత్యుత్తమ వ్యక్తులు, సంస్థలను సత్కరించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రజా సేవ, దౌత్యం,



వ్యాపార రంగాలలో రాణించిన వారిని కీర్తించిందన్నారు. ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ ప్రదీప్, బోర్డు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసప్ప మృతి పార్టీకి లోటు --ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



**అంకుశం న్యూస్ మడకశిర.02 జూలై:** టిడిపి సీనియర్ నాయకు డు లక్ష్మీ నరసప్ప ( బుడ్డ న్న) గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. పట్ట ణం లోని శివాపురం వాసి అయిన బుడ్డన్న తెలుగు దేశం పార్టీలో రెండుసార్లు ఎంపీపీ, ఒకసారి జడ్పిటి సి,బ్యాంకు చైర్మన్ గా వివిధ పదవులలో పదవులు అను భవించి వివాద రహిత రాజ కీయవేత్తగా లక్ష్మీ నర్సప్ప మెలుగుతూ వచ్చారు. ఉన్న ఫళంగా గురువారం మధ్యాహ్నం అకాల మృతి చెందారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ ము న్సిపల్ హుటా హుటిన మా జీ చైర్మన్ నర సింహ రాజు ఇంటికి చేరుకొని బుడ్డన మృతదే హానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. బుడ్డన్న మృతి తో పార్టీకి తీరని లోటు ఏర్పడిందని శకోతప్త హృదయంతో అ న్నారు. మృతుని కుటుం బానికి తెలుగుదేశం పార్టీ ఎల్ల వేళలా తోడు ఉంటుం దని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు భరోసా ఇచ్చారు.మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూ ర్తి ,సుబ్బారెడ్డి ,దాసిరెడ్డి తదితరులు హాజరై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఓడిచెరువు మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి



**అంకుశం న్యూస్, ఓబుల దేవర చెరువు, జూలై:2:** శ్రీ సత్యసాయి జిల్లా,ఓడిచెరువు మండలంలోని, సున్నంపల్లి,అల్లాపల్లి, తంగేడుగుంట, కమ్మవారిపల్లి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీ లక్ష్మిరెడ్డి పార్టీ బీఎల్ఏలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన, ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి,ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా,ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా వెరిఫికేషన్ నిర్వహించాలని సంబంధిత బీఎల్ఓలకు సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లక్ష్మిరెడ్డి అన్నారు. ఓటర్ల హక్కులను పరిరక్షించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పోలింగ్ బూత్ కమిటీ మేనేజర్ భానుప్రకాష్ రెడ్డి,పార్టీ బీఎల్ఏలు హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## .పాత ప్రభుత్వాసుపత్రి లో నూతన క్రిటికల్ కేర్ భవనలు ఏర్పాటు

పాత ప్రభుత్వ ఆసుపత్రి లో కేశినేని చిన్ని ఆకస్మిక తనిఖీ
క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాలను పరిశీలన
ఈ నెల 9న కేంద్ర మంత్రి జెపి నడ్డా తో కలిసి ప్రారంభోత్సవం..





**అంకుశం ప్రతినిధివిజయవాడ జులై 2 :**ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటున్న విజయవాడ ప్రభుత్వ పాత ఆసుపత్రి లో కేశినేని చిన్ని ఆకస్మిక తనిఖీ చేశారు క్రిటికల్ కేర్ నూతన భవనాలను అయన సందర్శించారు. నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, ఇంజినీర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ, ఈ నెల 9వ తేదీన కేంద్ర మంత్రి జెపి నడ్డా తో కలిసి నూతన భవనాలను ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఎంపీ చిన్ని ప్రకటించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో సిద్ధమవుతున్న ఈ భవనాలు విజయవాడతో పాటు పరిసర జిల్లాల ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కీలకంగా నిలుస్తాయని తెలిపారు. పరిశీలన సందర్భంగా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందితో ఎంపీ చర్చించి, వైద్య సేవల నిర్వహణ, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని, ఇంకా అవసరమైన సదుపాయాలపై సూచనలు స్వీకరించారు. ఆసుపత్రి సూపరిండెంట్ ఆసుపత్రికి వచ్చే రోగులు మరియు ప్రజలు కోసం వెయిటింగ్ హాల్స్ ను అడిగితే స్వయంగా ఎంపీ నిధులతో రెండు వెయిటింగ్ హాల్స్ నిర్మాణం చేసి ఇస్తానని హామీ ఇచ్చారు ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని పేర్కొన్న ఎంపీ చిన్ని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవాభావంతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అత్యాధునిక వైద్య పరికరాలు, విశాలమైన వార్డులు, మెరుగైన మౌలిక వసతులతో సిద్ధమవుతున్న నూతన భవనాలు అందుబాటులోకి వస్తే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి సేవలు మరింత విస్తరించి వేలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుందని అధికారులు తెలిపారు.

## మంచు పెర్రర్ ను కలిసిన డాక్టరేట్ అవార్డు అందుకున్న ధర్మవరం గొడుగు నాగరాజు మత్స్య కార్మిక సంఘం నాయకులు

**అనంతపురం అంకుశం న్యూస్ జులై 2:** ఆర్డిటి డైరెక్టర్ మంచు ఫెర్రర్ లో ఇంటర్నేషనల్ పీస్ ఆఫ్ కౌన్సిలింగ్ అచ్చి వర్స్ వారిచే డాక్టరేట్ అవార్డు అందుకున్న ధర్మవరం గొడుగు నాగరాజు మత్స్య కార్మిక సంఘం నాయకులు ఆర్డిటి క్యాంప్ కార్యాలయం నందు గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా మంచు పెర్రర్ ను కలిశారు. గత ఫస్ట్ కోవిడ్ సమయంలో సేవా కార్యక్రమంలో విశేష సేవలు అందించిన గొడుగు నాగరాజుకు ఇంటర్నేషనల్ ఫీస్ ఆఫ్ కౌన్సిలింగ్ అచీవర్స్ డాక్టరేట్ అవార్డు దక్కింది. ఈ అవార్డు ఆర్డిటి డైరెక్టర్ మంచు పెర్రర్ కి అంకితం చేస్తున్నానని గొడుగు నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గొడుగు నాగరాజు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఆర్డిటి సంస్థ ఎనలేని సేవ చేసిందన్నారు. అందులో భాగంగా తన వంతు నేను సేవా కార్యక్రమాలు ప్రజలకు చేశానన్నారు అయినప్పటికీ తనకు దక్కిన అవార్డు ఆర్డిటికే అంకితం అవుతుందన్నారు. నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్డిటి ఎనలేని కృషి చేస్తుందన్నారు. విద్య వైద్యం ఆరోగ్యం భద్రతపై ప్రత్యేక శ్రద్ధ ఆర్డిటి కనబరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం నాయకులు రమణ 6 టీవీ రిపోర్టర్ బాలరాజు, కుళ్లాయప్ప హరి తదితరులు పాల్గొన్నారు.



